ప్రజాశక్తి

శనివారం 23 మార్చి 2024

భారీగా బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పాచిపెంట

సాలూరు రూరల్ సిఐ జి.బాలకృష్ణ, స్థానిక ఎస్సై పి.నారాయణరావు ఆధ్వర్యాన ఒడిశాలోని సుంకి ఎస్సై, తన సిబ్బంది కలిసి సుంకి పోలీస్ స్టేషన్ పరిధిలో గల లావిడి, కాందిలి, ఒలిసి, పులి గుంట తదితర గ్రామాల్లో నాటు సారా తయారీ కేంద్రాలపై సంయుక్తగా సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 42,00 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసి 140 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేశారు. స్వాధీనం చేసుకొన్న నాటుసారాను సుంకి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

కోళ్లకే అవకాశం

- ఎట్టకేలకు ఎస్.కోట టిడిపి అభ్యర్థి ప్రకటన
- గొంప క్రిష్ణకు నిరాశ
- రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/శృంగవరపుకోట

శృంగవరపుకోట టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి అవకాశం దక్కింది. అధిష్టానం ఎట్టకేలకు శుక్రవారం ఆమె పేరును ప్రకటించింది. దీంతో, చాలా కాలంగా సీటు ఆశించి, కోళ్లకు పోటీగా పార్టీ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు చేపట్టిన గొంప క్రిష్ణ కంగుతిన్నారు. తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్రంగా పోటీచేయనున్నట్లుగా కూడా ప్రకటించారు. భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సివుంది. అభ్యర్థి లలిత కుమారి గతంలో 2 సార్లు ఎమ్మెల్యేగాను, ఒకసారి టిటిడి బోర్డు మెంబర్‌గాను పనిచేశారు. తాత కీర్తిశేషులు కోళ్ల అప్పలనాయుడు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా, టిడిపి నుంచి రెండుసార్లు ఎన్నికయ్యారు. దేవాదాయ శాఖ మంత్రిగా సేవలందించారు. అదే వారసత్వంతో రాజకీయాల్లోకి లలితకుమారి వచ్చారు. ఈనేపథ్యంలో మరోసారి టిడిపి అధిష్టానం పోటీకి అవకాశం కల్పించింది.

వాస్తవానికి రెండేళ్ల క్రితం వరకు గొంప క్రిష్ణ విదేశాల నుంచి టిడిపి సహకరించారు. ఆ తరువాత టిడిపి రాష్ట్రనేతలే జిల్లాకు తీసుకొచ్చి ఎస్.కోట ఎమ్మెల్యే సీటుపై ఆశలు కల్పించారు. దీంతో, లలిత కుమారితో సమాంతరంగా కార్యక్రమాలు చేయడంతో చంద్రబాబు, లోకేష్ నియోజకవర్గ పర్యటనలతో లలిత కుమారితో సమానంగా ప్రాధాన్యతనిచ్చి స్టేజిలు కూడా ఎక్కించారు. దీంతో, క్రిష్ణతోపాటు ఆయన అనుయాయుల్లో ఆశలు పెరిగాయి. చివరకు టిక్కెట్ రాకపోవడంతో ఆయన అభిమానులు శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. ముఖ్యంగా వేపాడ మండలంలో నిరసనలు పెల్లుబికాయి.

లలితకుమారి నేపథ్యం

కోళ్ల లలితకుమారి కుటుంబం 50 ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నారు. ఆమె తాత కోళ్ల అప్పలనాయుడు టిడిపి ఆవిర్భావం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతకుముందు స్వతంత్రంగా రెండుసార్లు గెలిచారు. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న లలితకుమారి ఎస్.కోట నియోజకవర్గం నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తాజా ఎన్నికలతో టిడిపి ఆధ్వర్యాన పదో సారి ఆ కుటుంబానికి ప్రాధాన్యత కల్పించినట్లు అయ్యింది.

భగ్గుమన్న గొంప గ్రూపు

- టిడిపి పదవులకు రాజీనామా
- ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

శృంగవరపుకోట ఎమ్మెల్యే టికెట్‌ను కోళ్ల లలితకుమారికి కేటాయిస్తూ టిడిపి అధిష్టానం నిర్ణయంపై గొంప క్రిష్ణ గ్రూపు భగ్గుమంది. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణతోపాటు ఆయన గ్రూపు నాయకులంతా తమ పార్టీ పదవులకు రాజీనామాలు చేశారు. శుక్రవారం శృంగవరపుకోటలోని పార్టీ కార్యాలయంలో గొంప క్రిష్ణ తన అనుచరులతో సమావేశమయ్యారు. అందులో రాష్ట్ర కార్యదర్శి పదవికి గొంప క్రిష్ణ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, కొత్తవలస మండల అధ్యక్షులు గొరపల్లి రాము, జామి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి.. వారి పదవులకు రాజీనామా చేశారు.

గొంప క్రిష్ణ కార్యాలయంపై టిడిపి గుర్తులను చెరిపేస్తున్న అనుచరులు

ఈ సందర్భంగా గొంప క్రిష్ణ మాట్లాడుతూ కార్యకర్తల సూచనల మేరకు ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తానని ప్రకటించారు. ఎన్నారై గా ఉద్యోగం చేసుకున్న తనను ఎస్ కోట ఎమ్మెల్యే టికెట్ ఆశ చూపి నారా లోకేష్, విశాఖ ఎంపి అభ్యర్థి భరత్ ఎస్.కోట నియోజకవర్గానికి తీసుకువచ్చారని తెలిపారు. నిన్నటివరకు టిక్కెట్ ఇస్తామని చెప్పి చివరకు అధిష్టానం దెబ్బకొట్టడం సరైనది కాదని నాయకులంతా అన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని నాయకులంతా కోరడంతో గొంప క్రిష్ణ ఈ మేరకు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

చీపురుపల్లిపైనే అందరి చూపు

- ఇక్కడి అభ్యర్థి తేలితేనే భీమిలి, ఎచ్చెర్లలో క్లారిటీ
- టిడిపిలో కొలిక్కిరాని అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

> సాధారణంగా ఎన్నికల్లో ఫలితాల గురించి జనం ఆద్యంతం ఆసక్తికరంగా ఎదురు చూడడం సర్వసాధారణం. కానీ, ప్రస్తుతం చీపురుపల్లి టిడిపి అభ్యర్థి ఎవరనేదానిపై అదేరకమైన ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానంతో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో చెరొకటి చొప్పున రెండు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక ఆధారపడి ఉండడమే ఇందుకు కారణం. ఈనేపథ్యంలో చీపురుపల్లి టిడిపి శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

వైసిపిలో అత్యంత కీలక నేతగా ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చీపురుపల్లి నుంచి పోటీకి దిగుతున్న విషయం విధితమే. ఆయన వైసిపి జిల్లా రాజకీయాలను ఒంటిచేత్తో నడిపిస్తున్న నేత అనడంలో అతిశయోక్తి కాదు. ఎన్నికల్లో ఎత్తుకు పైఎత్తులేడంలో ఆయన దిట్ట. బహుశా అందుకేనేమో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి అవకాశం కల్పించాలన్న బొత్స విజ్ఞప్తిని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మారు మాట అడకుండా అంగీకరించారు. ఈ ఎన్నికల్లో కేవలం ఉమ్మడి విజయనగరం జిల్లాకే కాకుండా విశాఖ పార్లమెంట్ పరిధిలోనూ ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఆయన ప్రభావాన్ని తగ్గించాలంటే చీపురుపల్లిలో తగిన గెలుపు గుర్రాన్ని దింపాలని టిడిపి భావించడం, అందుకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపాలని ఆలోచించడం తెలిసిందే. ఇందుకు గంటా తొలుత తటపటాయించినప్పటికీ చివరకు తాడోపేడో అంటూ చీపురుపల్లివైపు దారి తీశారట. విశాఖ పార్లమెంట్ స్థానం అభ్యర్థిగా పోటీకి దిగుతున్న ఎం.భరత్ భీమిలిలో గంటాను దింపితే తన గెలుపు సునాయాశంగా ఉంటుందని భావిస్తున్నారట. ఈనేపథ్యంలో గంటా స్థానం ఎక్కడ అనేది అధిష్టానం ఇంకా పెండింగ్‌లో పెట్టింది. టిడిపి అధినేత చంద్రబాబు మాత్రం గంటాను చీపురుపల్లి పంపేందుకే వెంగగ్గ చూపుతున్నట్టు సమాచారం. జిల్లాలోని అశోక్ వంటి సీనియర్లు పోటీలో లేని నేపథ్యంలో గంటా వంటి సమర్థవంతమైన నాయకుడు అవసరమని భావిస్తున్నారట. మొత్తానికి గంటా ఎక్కడనేది తేలితే తప్ప చీపురుపల్లి, అటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, విశాఖ జిల్లా భీమునిపట్నం నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎవరనేది స్పష్టత వచ్చే అవకాశం లేదు. దీంతో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి, గంటా స్థానంపై జనం ఆశక్తికరంగా చర్చించుకుంటున్నారు. మరోవైపు శుక్రవారం టిడిపి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో ఎస్.కోట నుంచి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి అవకాశం దక్కినప్పటికీ, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ అభ్యర్థిత్వం ఇంకా పెండింగ్‌లోనూ ఉంది. పాలకొండ కన్నా అందరి చూపు చీపురుపల్లి రాజకీయాలపైనే కనిపిస్తోంది.

భగత్ సింగ్ స్ఫూర్తితో

మతోన్మాద శక్తులను ఎండగట్టాలి

సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - సీతానగరం

దేశంలో ప్రస్తుతం మతోన్మాదం వెర్రితలలు వేస్తుందని, కావున భగత్ సింగ్ ఆశయాలను, ఆకాంక్షలను, భావాలను విరివిగా ప్రజల్లో తీసుకువెళ్లి మతోన్మాద శక్తులను ఎండగట్టాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్థంతి సభ శుక్రవారం సీతానగరంలో జరిగింది. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులోనే ఉరి కంభాన్ని ముద్దాడి వీరమరణం పొందారని, ఆనాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కొనసాగిస్తున్న దోపిడీని వ్యతిరేకిస్తూ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం, భారతమాత దాస్య శృంఖలాలను తెంచి, బ్రిటీష్ వారి కబంధహస్తాల నుంచి విముక్తిగా వించిన పోరాటయోధుడని అన్నారు. తాను నాస్తికుడ్ని ఎలా అయ్యాను అనే పుస్తకం ద్వారా మతోన్మాద శక్తులను వ్యతిరేకించాడన్నారు. భగత్ సింగ్ మరణించి నేటికి 90 ఏళ్లయినా ఇంకా ఈ దేశంలో దోపిడీ కొనసాగుతుందని, మతోన్మాదం వెర్రితలలు వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు కేంద్రంలో మతోన్మాద ప్రభుత్వం అధికారం ఉందని, దీని ప్రమాదాన్ని ప్రజల్లో తీసుకువెళ్లి మతోన్మాద శక్తులను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అవలంభిస్తున్న విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతకు తీవ్ర నష్టం చేస్తున్నప్పటికీ, రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి బిజెపిని వ్యతిరేకించకపోగా బలపర్చడం, జట్టు కట్టడం సిగ్గుచేటని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే మూడు వ్యవసాయ చట్టాలను, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను బిజెపి తీసుకువస్తే టిడిపి, వైసిపి బలపర్చాయని దుయ్యబట్టారు. బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను ఓడించి ప్రజల తరపున నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు నాయుకులు జి.వెంకటరమణ, ఐద్వా ఉపాధ్యక్షులు వి.రామలక్ష్మి, రైతు సంఘం నాయకులు బోరపరెడ్డి అప్పారావు, రెడ్డి రమణ మూర్తి , తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల నివాళ్లు అర్పిస్తున్న కృష్ణమూర్తి, నాయకులు

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రచారానికి అనుమతులు తప్పనిసరని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజకీయ పార్టీలు చేసే ఇంటింటి ప్రచారంతో సహా ఎటువంటి ప్రచారానికైనా అనుమతులుండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తప్పని సరిగా పొందాల్సి ఉందన్నారు. నేరుగా గానీ, ఎన్కోర్ పోర్టల్ ద్వారా గానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో సీజర్స్ అంశంపై ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీలను అప్రమత్తం చేయాలని, జిల్లా పరిధుల్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పటిష్టపర్చాలని సూచించారు. ప్రతి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వలెన్సు టీమ్‌ను పెట్టాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం జారీచేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 అత్యవసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన అథారిటీ లెటర్ కలిగి ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగులకు వారి విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి దుర్ఘటనలకు తావులేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దురదృష్టవశాత్తు ఎటు వంటి ఘటనలు జరిగినా తక్షణమే తగు చర్య తీసుకోవడంతో పాటు ఆ సంఘటనకు సంబంధించిన వాస్తవ నివేదికను వెంటనే తమకు పంపాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫార్మ్-7లో వివరాలను సరిదిద్దేందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం -8ను చట్టబద్ధమైన విధానంలో ఈనెల 26లోపు పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదులో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు చేపట్టొద్దని, క్రమ పద్ధతిలో వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారం - 6ను క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి మాత్రమే కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుండి ప్రతి రోజూ 9నివేదికలను భారత ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ఈ నివేదికలు పంపే విషయంలో ఏమాత్రం అలక్ష్యం వహించకుండా సకాలంలో నివేదికలను అందజేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వెంకటరమణ, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, నోడల్ అధికారులు మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్

ప్రతి నీటిబొట్టూ విలువైనదే

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి నీటిబొట్టు ఎంతో విలువైందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్ట్ ఆవరణలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నీటి ప్రాముఖ్యతను వివరించారు. సృష్టిలో ప్రతి జీవికి నీటి అవసరం ఎంతో ఉందని, నీటిని వృథా చేయకుండా, అవసరం మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని మరగబెట్టి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. వర్షాకాలంలో నీటిని పొదుపు చేసుకొనేందుకు ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సామాజిక ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుందని, తాగునీరు మానవ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరమని అన్నారు. పోషకాహారం, గాలి, మానవ జాతికి ప్రాథమిక జీవనోపాధిని అందిస్తుంది, ఇవి లేకుండా మనిషి జీవించడం అసాధ్యమని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస రావు, టి.జోగారావు, లోక్‌అదాలత్ మెంబరు జి.వెంకటరావు, అడిషనల్ పిపి. ఎం.వెంకటరమణ, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

జలమే బలం

గరుగుబిల్లి : నీటిని వృథా చేయరాదని, జలమే మన బలమని ఇఒపిఆర్‌డి గోపాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఎపిఎం పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రపంచం జల దినోత్సవం సందర్భంగా నీటి విలువను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకల జీవులు జలంపై ఆధారపడి జీవనం సాగించిన విషయం ప్రజలకు గుర్తు చేశారు. అందుకే మానవ మనుగడకు నీరు నిత్యం అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకొని పొదుపుగా వాడాలని ప్రజలకు అవగాహనా కల్పించారు. అలాగే తరిగిపోతున్న జలనిధిని కాపాడుకోవడం మన విధి అని నినాదాలు చేస్తూ గరుగుబిల్లిలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల్లో తనిఖీలు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చెక్ పోస్టుల్లో తనిఖీలు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం పాలకొండ సిఐ, ఇతర పోలీస్ అధికారులతో బందోబస్తు అంశాలపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల వారీగా బందోబస్తు ఏర్పాట్లపై ముందే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్టుల వద్ద పట్టుబడిన నగదు వివరాల నివేదికను ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిఐ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి శుక్రవారం ఐటిడిఎలో శిక్షణా తరగతులు నిర్వహించారు. సీతంపేట మండలానికి చెందిన ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజు నిర్వహించే విధులు, తప్పనిసరిగా చేయాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ సిబ్బంది చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సీతంపేట తహశీల్దార్, మహేశ్వరరావు, డిటి నాగేంద్ర కుమార్, మాస్టర్ ట్రైనీస్ హేమని కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం

పార్వతీపురం టౌన్ : మరికొన్ని రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని నియమించబడిన ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు శుక్రవారం ఉదయం వచ్చిన సమాచార మేరకు పట్టణ శివారులో ఉన్న కొత్తవలస ప్రాంతంలో పోలీస్ సిబ్బందితో కలిసి రహదారిపై రాకపోకలు సాగిస్తున్న పలు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నాయకులు నారాయణరావు, జగదీష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు, ఈ టీం తిరగడం జరుగుతుందని, అపరిచిత వ్యక్తులు పట్టణంలో సంచరిస్తే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని, రాజకీయ ప్రతినిధులు ప్రజలను ఎలాంటి ప్రలోభాలకు గురి చేసినా ముందస్తు సమాచారం ఇవ్వాలని, అలాగే తనిఖీలను నిర్వహించేటప్పుడు నగదు గానీ, ఏమైనా వస్తువులు గానీ ఉంటే వాటికి తగిన ఆధారాలను, బిల్లులను చూపించాలని, లేకుంటే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు.

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సీతానగరం : ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెక్టోరియల్ అధికారులైన ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ అన్నారు. శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ, ప్రైవేటు స్థలల్లో ఉండే వాల్ పోస్టర్లను చించి వేయడం ద్వారా ఇసి ఆజ్ఞలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ చిన్నారావు, ఎస్సై ఎం రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలవలసతో ఎమ్‌పి అభ్యర్థి తనూజ భేటీ

ప్రజాశక్తి - పాలకొండ

అరుకు పార్లమెంటరీ వైసిపి అభ్యర్థి చెట్టి తనూజ రాణి శుక్రవారం వైసిపి సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరంను కలుసుకొని ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఏ విధంగా ప్రచారం చేయాలో తదితర విషయాలను రాజశేఖరం వివరించారు. అలాగే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను కూడా ఎంపీ అభ్యర్థి కలిశారు. అనంతరం వీరఘట్టం మండలం వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని తనూజారాణి కలిశారు. ఈ ప్రాంత రాజకీయాలపై కొంతసేపు వీరు మాట్లాడుకున్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు ఇవిఎంలపై శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల్లో కీలకమైన ఇవిఎంల వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఆర్‌డిఒ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.హేమలత అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో డివిజన్లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఇవిఎంలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడతల వారీగా నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాల్లో మొదట దశ ఎన్నికల్లో కీలకమైన ఇవిఎం యంత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల ఎన్నికల ప్రొసీడింగ్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

జ్వరాలపై దృష్టిసారించాలి

జోనల్ మలేరియా అధికారి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి జ్వరాలు గుర్తించడంపై సిబ్బంది దృష్టి సారించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు ఆధ్వర్యంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులకు స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం నిర్వహించిన రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతిప్రభ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఫీవర్ సర్వలెన్స్ చేపట్టి, త్వరితగతిన జ్వరాలు గుర్తించాలని ఆదేశించారు. తద్వారా చికిత్స సత్వరమే అందించి జ్వర తీవ్రతను నియంత్రించవచ్చన్నారు. రాబోయే సీజన్లో జ్వరాలను అదుపులో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధం కావాలని, శిక్షణలో పొందిన పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందే స్థావరాలను గుర్తించడం, నియంత్రణా చర్యలు చేపట్టడంపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ రెండు రోజులు ఉంటుందని, కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమానికి సంబందించి ప్రతి అంశాన్ని పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తున్నామన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్రరావు, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ అప్పారావు, ఇఒ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 140 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - పార్వతీపురం

శుక్రవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు జిల్లాలో 140మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డిఇఒ జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో జరిగిన గణితం పరీక్షకు 10892మందికి గానూ 10572మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ శిలాఫలకాలు తదితర అంశాల్లో ఉన్న ఫొటోలకు, పేర్లకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సమయంలో ఏర్పాటు చేసిన నిర్మాణ శిలా ఫలకాలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు మొదలైన వాటిలో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫోటోలు, సందేశాలు ఉండరాదని ఆయన పేర్కొన్నారు. ప్రవర్తనా నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ శిలాఫలకాలు మొదలైన వాటిపై రాజకీయ నాయకుల ఫోటోలకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదని వివరించారు.

ఇవీ నిబంధనలు

◆ ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత రూపొందించే విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, టీకా సర్టిఫికెట్లు మొదలైన వాటిలో రాజకీయ నాయకులు, పార్టీల ఫోటోలు, సందేశాలు, చిహ్నాలు ఉండరాదు.

◆ ఎన్నికల ప్రచారానికి మంత్రులు అధికారిక వాహనాలను ఉపయోగించడంపై పూర్తి నిషేధం. ఎన్నికల ప్రకటనకు ముందు క్షేత్రస్థాయిలో ప్రారంభమై కొనసాగుతున్న కార్యక్రమాలు కొనసాగవచ్చు.

◆ మైదానాల వంటి బహిరంగ ప్రదేశాల్లో ఎన్నికల సమావేశాలను నిర్వహించడానికి అన్ని పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులకు నిష్పక్షపాతంగా అందుబాటులో ఉండాలి.

◆ స్థానిక పోలీసు అధికారులకు ప్రతిపాదిత సమావేశాల వేదిక, సమయం గురించి సకాలంలో తెలియజేయాలి. అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలి.

◆ ప్రతిపాదిత సమావేశం జరిగే ప్రదేశంలో నిర్బంధ లేదా నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటే, వాటిని గౌరవించాలి. మినహాయింపులు అవసరమైతే తప్పనిసరిగా దరఖాస్తు చేయాలి. అనుమతులు సకాలంలో పొందాలి.

◆ పతిపాదిత సమావేశాల కోసం లౌడ్‌స్పీకర్లు లేదా అటువంటి ఇతర సౌకర్యాల వినియోగానికి తప్పనిసరిగా అనుమతి పొందాలి.

◆ సమావేశాలకు భంగం కలిగించే వ్యక్తులతో లేదా అశాంతి సృష్టించే వ్యక్తులతో వ్యవహరించడంలో పోలీసుల సహాయాన్ని పొందాలి.

◆ ఏదైనా ఊరేగింపు ప్రారంభమయ్యే సమయం, ప్రదేశం, అనుసరించాల్సిన మార్గం, ఊరేగింపు ముగిసే సమయం, ప్రదేశం ముందుగానే నిర్ణయించి, ముందస్తు అనుమతులు పొందాలి.

◆ ఊరేగింపు వెళ్లాల్సిన ప్రాంతాల్లో అమలులో ఉన్న ఏవైనా నిర్బంధ ఉత్తర్వుల ఉనికిని నిర్ధారించాలి. వాటిని పాటించాలి. అన్ని ట్రాఫిక్ నిబంధనలు, ఇతర పరిమితులు పాటించాలి.

◆ ఊరేగింపు ప్రయాణానికి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండాలి.

◆ శాంతియుతంగా, క్రమబద్ధంగా పోలింగ్ జరిగేలా అన్ని సమయాల్లో ఎన్నికల అధికారులందరికీ సహకారం అందించాలి.

◆ తప్పనిసరిగా గుర్తింపు కార్డులను ప్రదర్శించాలి.

◆ ఓటర్లకు జారీ చేసిన అనధికారిక గుర్తింపు స్లిప్పులు తెలుపు కాగితంపై ఉండాలి. ఏదైనా గుర్తు, అభ్యర్థి పేరు లేదా పార్టీ పేరు ఉండరాదు.

◆ ప్రచార సమయంలోను, పోలింగ్ రోజున వాహనాల రాకపోకలపై ఆంక్షలు పూర్తిగా పాటించాలి.

◆ ఓటర్లు, అభ్యర్థులు, వారి ఎన్నికల/పోలింగ్ ఏజెంట్లు మినహా ఎన్నికల సంఘం నుండి నిర్దిష్ట చెల్లుబాటయ్యే అధికార లేఖ ఉన్న వ్యక్తులు మాత్రమే ఏదైనా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాలి. ఈ షరతు నుంచి ఏ కార్యనిర్వాహకుడికి కూడా మినహాయింపు లేదు.

◆ ఎన్నికల కమిషన్, రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు, సూచనలు ఎన్నికల వివిధ అంశాలకు సంబంధించిన అన్ని విషయాల్లో కట్టుబడి ఉండాలి.

◆ నియోజకవర్గం నుంచి ఓటరు లేదా అభ్యర్థి లేదా అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ మినహా ఇతరులు ప్రచార వ్యవధి ముగిసిన తర్వాత నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలి.

◆ ఓటరుకు ఎలాంటి ప్రేరేపణ, ఆర్థిక లేదా ఇతరత్రా అందించరాదు

◆ ఓటర్ల యొక్క కుల, వర్గ భావాలను ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించారు.

◆ వివిధ కులాలు, వర్గాలు, మత, భాషా సమూహాల మధ్య ఇప్పటికే ఉన్న విభేదాలను తీవ్రతరం చేసే లేదా పరస్పర ద్వేషాన్ని సృష్టించే లేదా ఉద్రిక్తత కలిగించే ఏ కార్యాచరణకు ప్రయత్నించరాదు.

◆ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తల వ్యక్తిగత జీవితంలో, ప్రజా కార్యకలాపాలతో సంబంధం లేని ఏ అంశాన్ని విమర్శించడానికి అనుమతించడం జరగదు.

◆ దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు లేదా ఏదైనా ప్రార్థనా స్థలం ఉపయోగించరాదు.

◆ ప్రలోభాలకు గురిచేయడం, ఓటర్లను బెదిరించడం, వ్యక్తిత్వం, పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, 48 గంటల వ్యవధిలో బహిరంగ సభలు నిర్వహించడం వంటి అనైతిక పద్ధతులు లేదా ఎన్నికల నేరాలకు సంబంధించిన కార్యకలాపాలు చేపట్టరాదు. ఓటర్లను పోలింగ్ స్టేషన్‌లకు, బయటికి తరలించడం నిషేధించడం జరిగింది.

◆ వ్యక్తుల అభిప్రాయానికి లేదా కార్యకలాపాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే విధంగా వారి ఇళ్ల ముందు ప్రదర్శనలు లేదా పికెటింగ్‌లను చేయరాదు.

◆ స్థానిక చట్టాలకు లోబడి, యజమాని యొక్క నిర్దిష్ట అనుమతి లేకుండా, జెండా స్టాఫ్‌లు కట్టడం, బ్యానర్లు పెట్టడం, నోటీసులు అతికించడం లేదా నినాదాలు రాయడం మొదలైన వాటి కోసం ఏ వ్యక్తి భూమి, భవనం, కాంపౌండ్ వాల్, వాహనాలు మొదలైనవాటిని ఎవరూ ఉపయోగించరాదు.

◆ ఇతర రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే బహిరంగ సభలు, ఊరేగింపుల్లో ఎలాంటి ఆటంకాలు సృష్టించకూడదు.

◆ మరొక పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్న ప్రదేశాల వెంట ఊరేగింపులు చేపట్టరాదు

◆ ఊరేగింపుదారుల్లో ఆయుధాలు దుర్వినియోగం చేయగల ఏ వస్తువులను కలిగి ఉండరాదు.

◆ ఇతర పార్టీలు, అభ్యర్థులు జారీ చేసిన పోస్టర్‌లను తొలగించడం, పాడుచేయ రాదు

◆ పోస్టర్లు, జెండాలు, చిహ్నాలు లేదా ఏదైనా ఇతర ప్రచార సామగ్రిని గుర్తింపు స్లిప్పుల పంపిణీకి లేదా పోలింగ్ బూత్‌ల సమీపంలో పోలింగ్ రోజున ఉపయోగించే స్థలంలో ప్రదర్శించరాదు.

◆ స్టాటిక్ లేదా కదిలే వాహనాలపై అమర్చిన లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటలకు ముందు లేదా రాత్రి 10 గంటల తర్వాత ఉపయోగించరాదు.

◆ సంబంధిత అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపుల్లో లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదు. సమావేశాలు, ఊరేగింపులు రాత్రి 10 గంటల తర్వాత కొనసాగించడానికి అనుమతిలేదు.

◆ పోలింగ్ రోజున, భద్రతాపరమైన ముప్పు ఉందని అంచనా వేస్తే అధికారిక భద్రత కల్పించిన ఏ వ్యక్తి తన భద్రతా సిబ్బందితో పోలింగ్ స్టేషన్ ఆవరణ (100 మీటర్ల లోపల) సమీపంలోకి ప్రవేశించరాదు. పోలింగ్ రోజున అలాంటి వ్యక్తి తన భద్రతా సిబ్బందితో నియోజకవర్గంలో తిరగరాదు. అధికారిక భద్రతను అందించిన వ్యక్తి కూడా ఓటరు అయితే, అతను లేదా ఆమె భద్రతా సిబ్బందితో పాటు అతని/ఆమె కదలికను ఓటు వేయడానికి మాత్రమే పరిమితం కావాలి

◆ భద్రతాపరమైన ముప్పు ఉన్నట్లు అంచనా వేసినా, అధికారిక భద్రతను అందించిన లేదా వ్యక్తిగత సెక్యూరిటీ గార్డులను కలిగి ఉన్న ఏ వ్యక్తిని ఎన్నికల ఏజెంట్ లేదా పోలింగ్ ఏజెంట్ లేదా కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించరాదు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గంగునాయుడు

ధాన్యం డబ్బులు చెల్లించకుంటే 25న తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం 21 రోజుల్లో రైతు ఖాతాలకు డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి నేటికి మూడు నెలలు కావస్తున్నా ఒక్క రూపాయి చెల్లించడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొల్లి గంగు నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తుంబలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని 4వేల మంది రైతులకు చెందిన రూ.48 కోట్ల 25 లక్షలు ధాన్యం బకాయిలు ఉన్నాయన్నారు. వీటిని సోమవారంలోగా చెల్లించకుంటే రైతులతో కలిసి ఎన్నికల నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల సహకారంతో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ధాన్యం డబ్బులు రాక రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు తక్షణమే ధాన్యం డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండలం కార్యదర్శి జి.శ్రీనివాసరావు , రైతులు పాల్గొన్నారు

డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న కోటేశ్వరరావు

కోటేశ్వరరావుకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - కురుపాం

కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి, సామాజిక కార్యకర్త అయిన అంధవరపు కోటేశ్వర రావు అరుదైన గౌరవం దక్కింది. కరోనా సమయంలో తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పేద ప్రజలకు మాస్కులు, శానిటైజర్లతో పాటు నిత్యం ఆహార పొట్లాలు అందజేసేవారు. అంతేకాకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాలను తీరుస్తూ ఎల్లవేళల అందుబాటులో ఉంటూ ఆదుకుంటున్నందుకు ఆయన సేవలను విశాఖపట్నానికి చెందిన సెయింట్ పాల్స్ థియోలాజికల్ కాలేజ్ వారు గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను చేసిన సేవలకు గుర్తించి డాక్టరేట్‌ను అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. డాక్టరేట్ ను అందుకున్న సందర్భంగా కురుపాంకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కాలువలపై ఆక్రమణలు తొలగిస్తున్న కార్మికులు

కాలువలపై ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రాయగడ రోడ్డు శివారు నుంచి స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి దాటి బెలగాం శివారు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాల యజమానులు కాలువలను ఆక్రమించారు. దీంతో కాలువల్లో ఉండే చెత్త, వ్యర్థాలను తొలగించేందుకు శుక్రవారం మునిసిపల్ ప్రజారోగ్య అధికారులు జెసిబి సహాయంతో కాలువలపై ఉన్న పలకలను తొలగించి పూడికలను తొలించారు. మున్సిపల్ ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పరిధిలో ఉన్న 4వ వార్డులో కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి పూడికలను తీసివేసేందుకు చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చలివేంద్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్ గర్భిణులు, చంటిపిల్లలు, వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధన్, శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణిత పరీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

శుక్రవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని జోగింపేట ప్రతిభా గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 173 మందికి విద్యార్థులకు ఒకరు హాజరు కాలేదు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ముగ్గురు గైర్హాజరయ్యారు. అలాగే సీతానగరం జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 142 మందికి 141 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరైనట్టు ఎంఇఒ సూరిదేముడు తెలిపారు.

మండలంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఓటు హక్కు వినియోగంపై ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఉండేందుకు గాను మండలంలోని పలు ప్రధాన కూడళ్లలో పోలీసులు కవాతును నిర్వహించారు. పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావు, స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో కవాతును శుక్రవారం నిర్వహించారు. ఉల్లిభద్ర, ఖడ్గవలస జంక్షన్లో, కొంకడివరం పంచాయతీ సీతారాంపురంలో కేంద్ర బలగాలు, అలాగే సివిల్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ప్రతి పౌరుడు తప్పక ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజల మేలును కోరే అభ్యర్థులను ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

పట్టణంలోని బెలగాంలో సుందరయ్య భవనం పక్కనే రహదారికి ఆనుకుని ఉన్న కాలువలపై అనధికార నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని తక్షణమే తొలగించాలని సిపిఎం పట్టణ నాయకులు జి.వెంకటరమణ, బి.సూరిబాబు తెలిపారు. కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ, ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న ప్లానింగ్ సెక్రటరీలు కానీ పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు బరితెగించి నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. ఈ నిర్మాణాల వల్ల కాలువల్లో చెత్తలు, వ్యర్థాలు పేరుకుపోయి, మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. దీంతో భవిష్యత్తులో పారిశుధ్య కార్మికులు పనులను చేసేందుకు ఇబ్బందులు పడనున్నారని, కావున తక్షణమే ఆక్రమణలను అధికారులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి ద్రోహం చేసే కూటమిని ఓడించండి : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, టిడిపి, జనసేన కూటమిని, హక్కులు, ప్రజలపై దాడి చేసిన నిరంకుశ వైసిపి అభ్యర్థులను ఓడించాలని, సిపిఎం, వామపక్ష , లౌకిక పార్టీల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మక్కువలో సిపిఎం మండల కమిటీ సమావేశం పి.సీతారాం అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అవలంబిస్తున్న ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక, హక్కుల భద్రతకు తీవ్ర నష్టం చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన బిజెపిని వ్యతిరేకించకపోగా బలపర్చడం, జత కట్టడం సిగ్గుచేటని, రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే మూడు వ్యవసాయ చట్టాలను, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్లను బిజెపి తీసుకువస్తే టిడిపి, వైసిపిలు బలపరిచాయని దుయ్యబట్టారు అందుకు వీరిని ఓడించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి కూటమి, నిరంకుశ వైసిపిలను ఓడించాలని ప్రజలు రైతులు గిరిజనులు మహిళలు, ఉద్యోగ, కార్మికులు, దళితులు, మహిళలు తరఫున నికరంగా పోరాడుతున్న సిపిఎం , వామపక్షలౌకిక, ప్రజాతంత్ర అభ్యర్థులను రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మక్కువ మండల కన్వీనర్ తాడంగి ప్రభాకర్, రాజారావు, చంటి , సురేష్ రమణ, వై మన్మధరావు, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, కలిశెట్టి జగ్గారావు, గిరిజన సంఘం నాయకులు రాజా రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో గిరిజన, దళిత గ్రూపులకు ఉపాధి పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కొమరాడ : మిత్ర పక్షాల అభ్యర్థులను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిర ప్రజలను కోరారు. మండలంలోని పొడుగువలసలో సిపిఎం కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అవలంభిస్తున్న విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతకు తీవ్ర నష్టం చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి బిజెపిని వ్యతిరేకించకపోగా బలపర్చడం, జట్టు కట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కావున బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను ఓడించి ప్రజల తరఫున నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను రాబోయే పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లాకమిటీసభ్యులు కె.సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు కొండ గౌర్రె అప్పలస్వామి, గిరిజన యువకులు పాల్గొన్నారు.

చినబోగిలిలో క్రాష్ పోగ్రాం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినభోగిలిలో క్రాష్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాడైపోయిన మంచినీటి బోర్లు మరమ్మతులు చేపట్టారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడిని నివారించేందుకు అన్ని గ్రామాన్ని కార్యక్రమం జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ బోరు మెకానికల్ సత్యనారాయణ, పి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ప్రజారోగ్య శాఖ అధికారి సిహెచ్ మురళికి సూచించారు. పట్టణంలోని 27వ వార్డు పరిధిలో గల పోలీస్ స్టేషన్ వీధిలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమగా జరగడంలేదన్న విమర్శలు వస్తున్నాయని, కావున పారిశుధ్య నిర్వహణకై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్నామని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎపిఒ ఎ.భానును కలిసి మాట్లాడారు. మండలంలోని నిడగల్లు, బగ్గందొరవలసకు చెందిన ఉపాధి కూలీలకు గత నాలుగు వారాలుగా ఉపాధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాక నిడగల్లులో వికలాంగుల గ్రూపులకు చెందిన ఉపాధి కూలీలకు వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ త్వరగా బిల్లులయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాయిపల్లి భాస్కరరావు, నక్క త్రినాధరావు, నక్క ఆనంద్, జాడ రాము తదితరులు పాల్గొన్నారు.

ఎపిఓతో మాట్లాడుతున్న నాయకులు, వేతనదారులు

విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నడుకూరు గ్రామస్తులు

విద్యుత్ సమస్య పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో విద్యుత్తు సమస్య పరిష్కరించాలని మండలంలోని నడుకూరు గ్రామస్తులు శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఇళ్లకు ఇచ్చే ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యవసాయ మోటార్లకు కనెక్షన్ ఇవ్వడంతో గ్రామంలోని సుమారు 100 ఇళ్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ లేక తాము ఇబ్బందులు పడటంతో పాటు రోగాల బారిన కూడా పడుతున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో లైన్మెన్ ఉన్నప్పటికీ ఏ విధమైన సమస్యలు పరిష్కరించడం లేదని, గ్రామంలో విద్యుత్‌పై అవగాహన ఉన్న వ్యక్తి ట్రాన్స్‌కో కార్యాలయానికి ఫోన్ చేసి గ్రామానికి రావాల్సిన విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేస్పందన లభించింది. వివిధ విభాగాలకు చెందిన 23 మంది వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. రావుపల్లిలో శ్రీసీతారామ మందిర పున: ప్రతిష్ట మహోత్సవాలు ప్రాంభమైన నేపథ్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ మాట్లాడుతూ తమ స్వగ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ వైద్య శిబిరమును రావుపల్లితో పాటు గరుగుబిల్లి ,కొత్తూరు , కొత్తపల్లి, శివ్వాము ,తదితర గ్రామాలకు చెందిన సుమారు 2వేలమందికి తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. వైద్యశిబిరానికి ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారికి మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈవైద్య శిబిరం విజయవంతానికి సహకరించిన సూర్య ప్రకాష్, రామ్ నరేష్‌ను, ఇతర వైద్యులను రావుపల్లి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అభినం దించారు.

తహశీల్దార్ కార్యాలయానికి 'కోడ్' వర్తించదా ?

ప్రజాశక్తి - కురుపాం

తహశీల్దార్ కార్యాలయంలో బీరువాకు ఉన్న స్టిక్కర్

గతం కంటే ఈసారి ఎన్నికల నిబంధనలు కఠినతరంగా అమలు చేస్తున్నారు. అయితే ఐదేళ్ల క్రితం టిడిపి హయాంలో అప్పటి చంద్రబాబు సంక్రాంతి కానుక స్టిక్కర్లను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బీరువా కు అతికించారు. వీటిపై చంద్రబాబు ఫోటో ముద్రించి ఉంది. ఎటువంటి పరిస్థితుల్లోనైనా చెక్కుచెదరకుండా గట్టిగా అంటించి ఉన్నారు. నాటి నుండి నేటి వరకు అది అలాగే ఉంది. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో వాటివైపు ఎవరూ కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. ప్రతి ఇంటికీ అంటించి ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్టిక్కర్ సైతం అధికారులు తొలగించారు. వారి కార్యాలయంలో ఉన్న ఈ స్టిక్కర్ అధికారులకు కన్పించడం లేదా, లేక ఇవి ఓటర్లను ప్రభావితం చేయవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

ఎన్నికల విధుల నుంచి వారికి మినహాయింపు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఇన్‌ఛార్జి డిఆర్ఒ కోరినట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. గర్భిణులు, చంటిబిడ్డలకు ఫీడింగ్ చేసే ఉపాధ్యాయినులు, 60 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం గల విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, కాన్సర్ పూర్తిగా ఆశక్తులైన ఉపాధ్యాయులను, జూన్ 2024 నాటికి ఉద్యోగ విరమణ చెందనున్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించడానికి ఇన్‌ఛార్జి డిఆర్ఒ కేశవ నాయుడు అంగీకరించినట్లు బాలకృష్ణ తెలిపారు. ఒకవేళ ఆయా కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు వచ్చి ఉంటే వారు సంబంధిత రిటర్నింగ్ అధికారిని సరైన ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేస్తే వారిని విధుల నుంచి మినహాయిస్తున్నట్టు వారు తెలిపారు. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్తులైన వారిరువురికీ ఎన్నికల విధులకు ఉత్తర్వులు వచ్చిన సందర్భంలో వారిలో ఒకరికి, ప్రధానంగా మహిళా ఉద్యోగికి ఎన్నికల విధుల నుంచి మినహాయించాల్సిందిగా కోరామని, దీన్ని పరిశీలిస్తున్నామని ఇన్‌ఛార్జి డిఆర్ఒ హామీ ఇచ్చినట్టు బాలకృష్ణ తెలిపారు.

సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - కొమరాడ

ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తహశీల్దార్ రమేష్ అన్నారు. శుక్రవారం ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన కూనేరు అంతర్రాష్ట్ర రహదారిపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చెక్ గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌గేట్ వద్ద 24 గంటలు అధికారులు నిఘా వ్యవస్థలో ఉంటారని అన్నారు. సి-గేటు వద్ద తనిఖీల్లో భాగంగా ముగ్గురు అధికారులతో పాటు వివిధ శాఖ అధికారులను నియమించినట్లు తెలిపారు. వారు సరిహద్దు ప్రాంతంలో ప్రతి వాహనాన్ని పరిశీలించి అనంతరం వాహనాన్ని విడిచిపెడతారని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ తీవ్ర ప్రయత్నం చేసిందని, కావున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఈ చెక్‌గేట్ వద్ద ఉప తహశీల్దార్ శివయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సీతానగరం : మండలంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన స్థానిక ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు ప్రకారం చినబోగిలికి చెందిన చుక్క వాసు పార్వతీపురం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తన గ్రామం దాటేసరికి పార్వతీపురం నుండి బొబ్బిలి వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో వాసుకు తీవ్రగాయాలవ్వడంతో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

కొమరాడ : అకాల గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గాలులకు పడిపోయిన మొక్కజొన్న పంటలను సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. మంగళవారం రాత్రి వీచిన భారీ గాలులకు మండలంలోని చినఖేర్జెల పంచాయతీ బట్టిమొగలివలసలో మొక్క జొన్న నేలకొరిగిందన్నారు. చేతికొచ్చే సందర్భంలో పంట నేలపాలైనందని గిరిజన రైతులు లబోదిబోమంటున్నారన్నారు. ప్రతిసారి ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కావున ఈసారైనా ప్రభుత్వం మొక్కజొన్న పంట రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మం, సింగన్న రాము పాల్గొన్నారు.

24న ఉచిత కంటి వైద్య శిబిరం

పార్వతీపురం టౌన్ : ఈనెల 24న పట్టణంలోని ప్రభుత్వ పింఛనుదారుల సమావేశ మందిరంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రిటైర్డ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యదర్శి డి.గణపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రిటైర్డ్ పింఛనుదార్లు, ఎలక్ట్రికల్, ఎపిఎస్ఆర్టీసీ ఉద్యోగులకు, ఇహెచ్ఎస్ ఉన్న వారు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.